క్లుప్తంగా

వన్‌టౌన్ పీఎస్‌లో ఆయుధపూజ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నగరంలో శాంతి భద్రతలను పరిరక్షించాలని ఇంద్రకీలాద్రిపై కొలువైయున్న శ్రీకనకదుర్గమ్మను వేడుకుంటూ వన్‌టౌన్ పోలీసులు శుక్రవారం ఆయుధ పూజ చేశారు. దసరా మహోత్సవాల్లో భాగంగా తొమ్మిదవ రోజు పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై అమ్మవారి చిత్రపటాలను ఉంచి శాస్త్రోక్తంగా పూజాదికాలను నిర్వహించారు. బ్రిటీష్ కాలం నుంచి అప్పటి ఠానేదార్‌గా వ్యవహరించే పోలీసులు దసరా శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి పూజలు చేయడం ఆనవాయితీ. ఈ క్రమంలో ప్రస్తుత స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా ఉన్న సీఐ జి.గురుప్రకాష్ దంపతులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అమ్మవారి ముందు ఆయుధాలను ఉంచి పూజలు నిర్వహించారు. తొమ్మిదవ రోజైన ఆశ్వయుజ శుద్ధ నవమినాడు ఆయుధ పూజ చేస్తారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న పోలీస్ క్వార్టర్స్‌లో నివాసముంటున్న సిబ్బంది, కుటుంబసభ్యులతో హాజరయ్యారు.

జగన్మాతా.. కరుణించమ్మా...



కళా వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న కళాకారులు

ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ శుక్రవారం శ్రీమహిషాసురమర్దినిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. దసరా ఉత్సవాలు ముగియనుండటంతో పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం భవానీలు కొండపైకి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. జగన్మాతా.. కరుణించమ్మా అంటూ భక్తులు అమ్మవారిని వేడుకున్నారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



కృష్ణానది తీరాన బాణసంచా వెలుగులు



విద్యుత్ వెలుగుల్లో ప్రకాశం బ్యారేజీ



అమ్మవారి విగ్రహంతో భవానీలు



జల్లు స్నానాలు చేస్తున్న భవానీలు



అమ్మవారి సన్నిధిలో సినీ నటి అనన్య నాగళ్ల

దసరా ఉత్సవాలు వన్‌టౌన్ పీఎస్‌కు ప్రత్యేకం

- దశాబ్దాలుగా కొనసాగుతున్న ఆచారం
- నేటి రాత్రి పారువేటోత్సవం
- వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు విచ్చేయనున్న దుర్గమ్మ



విద్యుత్ దీపాలంకరణతో వన్‌టౌన్ పీఎస్ ప్రాంగణం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ దసరా మహోత్సవాల్లో వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఇంద్రకీలాద్రిపై కొలువైయున్న శ్రీదుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానం నిర్వహించే దసరా ఉత్సవాల్లో చివరిరోజైన విజయదశమినాడు పోలీసులు దుర్గమ్మను పూజించడం అనాదిగా వస్తోన్న ఆచారం. తెల్లదొరల పాలనలో అప్పటి పోలీస్ ఠానేదార్‌గా వ్యవహరించే అధికారి ఈ పూజలను జరిపేవారు. అప్పటి నుంచి ఆనవాయితీగా వస్తూ ప్రస్తుతం స్టేషన్ హౌస్ ఆఫీసర్‌గా వ్యవహరించే అధికారి ఈ ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజాదికాలను జరుపుతారు. ఏటా జరిగే దసరా నవ రాత్రుల్లో చివరి రోజున అమ్మవారి తెప్పోత్సవం మొదలుకొని శమీపూజ వరకూ పోలీసులే ప్రధాన పాత్ర వహిస్తారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతారు. పోలీస్‌స్టేషన్‌ను రంగురంగుల విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. దసరా శరన్నవరాత్రులు ప్రారంభం నుంచి స్టేషన్‌లో అమ్మవారి చిత్ర పటానికి పూజాదికాలను నిర్వహిస్తూ నిత్యం నైవేద్యాలను సమర్పిస్తుంటారు. అయితే గత కొన్ని దశాబ్దాలుగా దసరా ఉత్సవాలకు ప్రత్యేకంగా స్టేషన్ ప్రాంగణంలోనే అమ్మవారి మూర్తిని కొలువుదీసి ఉత్సవాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. విజయ దశమినాడు అమ్మవారి తెప్పోత్సవం ముగిసిన తర్వాత ఉత్సవమూర్తులను పల్లకిలో ఊరేగింపుగా వన్‌టౌన్ పోలీసు సిబ్బంది అమ్మవారి పాత మెట్ల వద్దకు తీసుకొచ్చేవారు. అక్కడ ప్రత్యేకంగా అలంకరించిన సింహవాహనంపై అమ్మను ఆసీనురాలిని చేస్తారు. అనంతరం పారువేటోత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవంలో భాగంగా అమ్మవారు సింహ వాహనంపై ఊరేగుతూ శమీపూజ జరిగే జమ్మిదొడ్డి ప్రాంతానికి చేరుతుంది. ఈ జమ్మిదొడ్డి బ్రాహ్మణవీధిలో మల్లికార్జునస్వామి మెట్ల మార్గం సమీపంలో ఉంది. పోలీసులు జమ్మికొట్టిన తర్వాత అమ్మవారి ఉత్సవమూర్తులను పోలీస్‌స్టేషన్‌కు తీసుకొస్తారు. అమ్మవారికి వన్‌టౌన్ పోలీసులతో పాటుగా పోలీసు అధికారులు ప్రత్యేకంగా పూజలు నిర్వహిస్తారు. వేకువజాము వరకూ పూజలను చేసి ఇంద్రకీలాద్రికి చేరుస్తారు. ఈ కార్యక్రమంతో దసరా మహోత్సవాలు ముగిసినట్లుగా భావిస్తారు.

పద కవితకు చిన్నారుల నృత్యాభిషేకం



నృత్యాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

విజయవాడ కల్చరల్: పద కవితకు చిన్నారులు నృత్యాభిషేకం చేశారు. రామదాసు కీర్తనలకు కళాకారుల అడుగులు నాట్యం చేశాయి. వాగ్గేయకారుల కీర్తనలకు చిన్నారులు చేసిన నృత్యాలు మనోహరంగా సాగాయి. శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దసరా మహోత్సవాలు, కళాకారుల నృత్యాభినయాలు ముగింపు దశకు చేరుకున్నాయి. శుక్రవారం నాటి కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాలనుంచి వచ్చిన కళాకారులు నృత్యసేవలో తరించారు. శివకుమారి బృందం భక్తి సంకీర్తనలను ఆలపించింది. హనుమంతరావు, యశస్వి, లక్ష్మీప్రసన్న బృందాలు భక్తి పాటలను ఆలపించాయి. నృత్య కార్యక్రమంలో భాగంగా నాట్యాచారిణి వనం లలితా దేవి బృందం వాగ్గేయకారుల కీర్తనలతో సంప్రదాయ నృత్యాలు ప్రారంభమయ్యాయి.ఆర్.యోషిత, కె.స్వాతివాహిని, సీహెచ్‌వీఎస్ కృష్ణ, ఎం.ప్రణతి, సీహెచ్ బాలా త్రిపుర సుందరి, ప్రశాంత్‌కుమార్, బి.దేవర్షిణి, సీహెచ్ ఆపీషా చౌదరి, కె.పావని ప్రియాంక, కె.జోషిత, వై.విజయవల్లి, ఎ.తరుణి, బీఎస్ భారతి, ఎస్.భారతి తమ బృందాలతో పలు అంశాలను ప్రదర్శించారు. కార్యక్రమాలను సైదా, గంగాధర్, కేఎస్ రామకృష్ణ నిర్వహించారు. నిర్వాహకులు చిన్నారులకు ప్రశంసా పత్రాలను అందజేశారు.



మహంతిపురంలో మహిషాసురమర్దనిదేవిగా అమ్మవారు



మహిషాసుర మర్దనిదేవిగా మహాలక్ష్మీ అమ్మవారు



దాసాంజనేయస్వామి వారి సన్నిధిలోమహిషాసురమర్దని

మహిషాసుర మర్దనిదేవిగా శాంభవీమాత







భూదేవిగా పద్మావతి అమ్మవారు



మహిషాసురమర్దనిదేవిగా గంగానమ్మ అమ్మవారు



మహిషాసురమర్దనిదేవిగా భ్రమరాంబ అమ్మవారు

రైల్వే ఉద్యోగులకు భద్రత ఏదీ..?

- లోకో పైలట్ హత్యతో ఉద్యోగుల్లో పెరిగిన అభద్రత భావం
- గతంలోనూ అనేక సార్లు రైల్వే ఉద్యోగులపై గంజాయి బ్యాచ్ దాడులు
- విధుల్లో భద్రత చర్యలు చేపట్టాలని సిబ్బంది డిమాండ్



లోకో పైలట్ హత్యకు గురైన నైజాంగేటు సమీపంలోని రైల్వే ట్రాక్

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లో గురువారం తెల్లవారుజామున జరిగిన లోకో పైలట్ హత్య ఘటనతో ఉద్యోగులు ఒక్క సారిగా ఉలిక్కి పడ్డారు. నిత్యం పగలు, రాత్రుళ్లు విధులు నిర్వర్తించే తమపై తరచూ గంజాయి, బ్లేడు బ్యాచ్‌లు దాడులు జరుగుతున్నాయని, దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా ప్రయోజనం లేకుండా పోతుందని వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విధి నిర్వహణలో ఉన్న లోకోపైలట్ ఎబినేజర్ హత్య మతిస్థిమితం లేని వ్యక్తి చేసినట్లుగా జీఆర్‌పీ పోలీసులు అనుమానిస్తున్నప్పటికీ రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు, ట్రాక్‌ల వెంబడి గంజాయి బ్యాచ్ దాడులు చేసి డబ్బులు, సెల్‌ఫోన్‌లు దోచుకుంటున్న సంఘటనలు అనేకం చోటుసుకుండటంతో ఈ హత్య కూడా వారి పనేనని ఉద్యోగులు భయందోళన వ్యక్తం చేస్తున్నారు.

రైల్వే స్టేషనే వీరికి ఆవాసాలు....

విజయవాడ రైల్వే స్టేషన్‌తో పాటు పరిసర ప్రాంతాలను గంజాయి బ్యాచ్ తమ అడ్డాగా మార్చుకుని మత్తులో కనిపించిన వారిపై దాడులకు తెగబడుతున్న సంఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయి. విజయవాడ పశ్చిమం వైపు తారాపేట, కాళేశ్వరరావు మార్కెట్, కృష్ణలంక బస్‌స్టేషన్ సమీపంలోని రైల్వే ట్రాక్‌లు, రాజరాజేశ్వరిపేట, నైజాంగేటు, కంసాలీపేట తదితర ప్రాంతాల్లో వీరి ఆడగాలు అధికంగా ఉంటున్నాయని ప్రయాణికులు, రైల్వే సిబ్బంది వాపోతున్నారు. ముఖ్యంగా రాత్రుళ్లు రైల్వే పరిసరా ప్రాంతాల్లో ఒంటరిగా ఎవరైనా కనిపిస్తే చాలు వారిపై దాడులు చేసి అందినకాడికి దోచుకుని పరారవుతున్నారు. కొన్ని సందర్భాల్లో వారిని హత్య చేసేందుకు కూడా వెనుకాడటం లేదు. నైజాంగేటు సమీపంలోని ఎఫ్ క్యాబీన్ వద్ద జరిగిన లోకో పైలెట్ హత్య కూడా డబ్బుల

పోలీసు పెట్రోలింగ్ పెంచాలి

విధి నిర్వహణలో లోకో పైలట్ ఆగంతకుడి చేతిలో హత్యకు గురవ్వడం బాధాకరం. గతంలోనే తమ సిబ్బందిపై అనేక సార్లు గంజాయి బ్యాచ్ దాడులు జరిగినట్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లాము. నైజాంగేటు సమీపంలోని రైల్వే ట్రాక్‌ల పరిసరాల్లో రాత్రిళ్లు విద్యుత్ లైట్లు కూడా లేకపోవడంతో చీకట్లోనే ఇటువంటి దారుణాలు జరుగుతున్నాయి. అధికారులు పని ప్రదేశాల్లో విద్యుత్ లైటింగ్ సదుపాయకం కల్పించి, పోలీసు పెట్రోలింగ్ పెంచాల్సిన అవసరం ఉంది.

– రామకృష్ణ, (ఏఐఎల్ఆర్ఎస్‌ఏ విజయవాడ డివిజన్ కార్యదర్శి)

స్నానఘాట్ల వద్ద అప్రమత్తంగా ఉండాలి



వస్త్రాల తరలింపుపై సూచనలు ఇస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): దసరా ఉత్సవాలకు వచ్చే భక్తులు స్నానఘాట్ల వద్ద వదిలే వస్త్రాలను ఎప్పటికప్పుడు కన్వేయర్ బెల్ట్ ద్వారా ఒడ్డుకు తీసుకురావాలని, అక్కడి నుంచి వెంటనే వాటిని తరలించాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం సీతమ్మ పాదాలు వద్ద ఉన్న కన్వేయర్ బెల్ట్ ద్వారా తీస్తున్న తరలిస్తున్న వస్త్రాలను పరిశీలించారు. దసరా నవరాత్రుల ఉత్సవాల్లో అమ్మవారి దర్శనానికి వచ్చే ప్రజలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నవరాత్రులలో విజయవాడ నగరపాలక సంస్థ వారు చేసిన ఏర్పాట్లలో ఎటువంటి లోటు లేకుండా చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉత్సవాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులందరూ అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, తాత్కాలిక మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహిస్తూ, త్రాగునీరు అందించడంలో ఎటువంటి లోపం లేకుండా క్యూలైన్ల వద్దనే అందిస్తూ ఉండాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన వైఎస్సార్ జక్కంపూడి కాలనీ లో పర్యటించి స్థానికుల నుంచి సమస్యలను తెలుసుకున్నారు. కాలనీలో వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

దాసాంజనేయస్వామి ఆలయంలో సువాసిని పూజలు



సువాసిని పూజలకు సిద్ధమైన చిన్నారులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కన్యకా పరమేశ్వరీ విస్సంశెట్టి వేంకటరత్నం హిందూ హైస్కూల్స్ కమిటీ ఆధ్వర్యంలో లోకకల్యాణార్థం జరుగుతున్న దసరా మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం సువాసిని పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కేబీఎన్ కళాశాల ఆవరణలోని దాసాంజనేయస్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో శ్రీ రుద్ర సహిత ద్విశత చండీయాగ మహోత్సవం అత్యంత వైభవంగా జరుగుతుంది. అందులో భాగంగా చిన్నారులను అమ్మవారి స్వరూపంగా భావించి సువాసిని పూజలు నిర్వహించటం సంప్రదాయం. వంద మందికి పైగా ఉన్న చిన్నారులకు పూజలు నిర్వహించారు.

మూలమంత్ర సంపుటితో చండీ హోమం....

చండీ సప్తసతి హోమంతో పాటుగా మహిషాసురమర్దినీదేవి అలంకారానికి సంబంధించిన మూలమంత్ర సంపుటితో చండీ హోమం నిర్వహించారు. అలాగే రుద్ర, శ్రీరామ, ఆంజనేయ, సుదర్శన, లక్ష్మీగణపతి, గరుడ, మహాలక్ష్మీ, మృత్యుంజయ, మన్యుసూక్త, నవగ్రహ హోమాలు, కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమంలో హిందూ హైస్కూల్స్ కమిటీ అధ్యక్షు, ప్రధాన కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, గోపిశెట్టి మల్లయ్య, కోశాధికారి గోళ్ల బాబావిజయకుమార్, కేబీఎన్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, తూనికుంట్ల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.